# ఉగ్రవాదుల దాడి అమానవీయం

## హుజురాబాద్ లో ఆర్యవైశ్యుల ర్యాలీ

## జమ్మూ కాశ్మీర్లో ముష్కరుల మారణ హోమాన్ని ఖండించిన ఆర్యవైశ్య సంఘం




హుజురాబాద్ ఏప్రిల్ 28 జనతా న్యూస్: జమ్మూ కాశ్మీర్లో ఇటీవల ఇస్లామిక్ ఉగ్రవాదులు చెలరేగిపోయి పెహల్గామ్ లో టూరిస్టుల పైకి కాల్పులు జరిపి విచక్షణా రహితంగా కాల్చి చంపడాన్ని హుజురా బాద్ ఆర్యవైశ్య సంఘం తీవ్రంగా ఖండించింది. పట్టణ ఆర్యవైశ్య, యువజన సంఘాల అధ్యక్షులు సుద్దాల హరిశంకర్ ఆధ్వర్యంలో ఆర్య వైశ్యులు పహల్గాం ఉగ్ర దాడిలో మరణించిన వారికి స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద ర్యాలీ నిర్వహించి మౌనం పాటించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సుద్దాల హరి శంకర్ మాట్లాడుతూ.. దేశంలో ఇస్లామిక్ ఉగ్రవాదాన్ని సమూలంగా అణిచివేయాలని కాశ్మీర్ ను రక్షించాలని అన్నారు. అమాయకుల ప్రాణాలను తీయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ నిర్దాక్షిణ్యంగా తీవ్రవాదాన్ని అణిచివేయాలని, ఎందుకు తమ మద్దతు ఉంటుందని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ గందే రాధిక శ్రీనివాస్, యువజన సంఘం అధ్యక్షులు నాగరాజు, సంఘ నాయకులు గర్రెపల్లి శ్రీనివాస్, పాల కృష్ణమూర్తి, రేణిగుంట్ల సురేష్, శ్రీనివాస్ నార్ల శ్రీనివాస్, మాడిశెట్టి ప్రసాద్, వేణుగోపాల్, ఈల శీల రాజేంద్రప్రసాద్, గంగిశెట్టి ప్రభాకర్, శశిధర్, అక్కినపల్లి అనిల్, నారాయణ, కొలిపాక అనిల్, అక్కినపల్లి శ్రావణ్ పాల్గొన్నారు.

# రైతులను దోపిడీ చేస్తున్న సీడ్ ప్లాంట్లు

## రైతు సంఘం నాయకుడు ముచ్చ సమ్మి రెడ్డి ఆరోపణ




హుజురాబాద్, ఏప్రిల్ 28 జనతా న్యూస్: రైతులను నిలువు దోపిడీ చేస్తున్న సీడ్ కంపెనీ యజమాన్యాలపై వ్యవసాయ శాఖ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రైతు సంఘం నాయకులు ముచ్చ సమ్మిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రెస్ క్లబ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ఇవ్వకుండా సీడ్ ప్లాంట్ల యజమానులు రైతులను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. సీడ్ కంపెనీ యజమానులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న రకాల వడ్లకు రూ.2320 మద్దతు ధర, రూ.500 బోనస్ ఇస్తుండగా, ఇందుకు విరుద్ధంగా సీడ్ కంపెనీలు కేవలం రూ.2750 మాత్రమే చెల్లిస్తున్నాయని ఆయన తెలిపారు. సీడ్ వరి పండించిన రైతులకు తరుగు పాటు 12 శాతం తేమ రావడానికి రెండు రోజులు ఎక్కువగా ఆరబోయాల్సి వస్తుందని, ద్వారా రైతులపై అదనపు భారం పడుతోందని ఆయన తెలిపారు. సీడ్ కంపెనీ యజమానులు క్వింటాలుకు రూ.100 తక్కువ ఇస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బహిరంగ మార్కెట్లో 17% తేమ ఉన్నప్పటికీ మద్దతు ధర రైతాంగానికి చెల్లిస్తున్నారని, కానీ సీడ్ కంపెనీలు మాత్రం మద్దతు ధర ఇవ్వకుండా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన తెలిపారు. సీడు వడ్లను పండించిన రైతులకు రూ. 3100 మద్దతు ధర కల్పించడంతోపాటు 20 రోజుల్లోనే ఆ డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు రావుల భాస్కర్ రెడ్డి, గూడూరు మల్లారెడ్డి, పో రెడ్డి కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ ప్రజా ఆదరణ చూస్తే, కాంగ్రెస్ నాయకులకు మతిభ్రమిస్తుంది



జనత న్యూస్ బెజ్జంకి : బిఆర్ఎస్ పార్టీ 25 సంవత్సరాల రజితోత్సవ వేడుకలకు కదిలిన ప్రజా దండును చూస్తే కాంగ్రెస్ నాయకులకు మతిభ్రమించి, ఉద్యమ నాయకుడు కేసీఆర్ పై అవాక్కులు, చివాక్కులు పేలుతున్నారని బిఆర్ఎస్ నాయకులు మరియు బెజ్జంకి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దీటి రాజు సోమవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమ నాయకుడు తన ప్రాణాలను కూడా తెలంగాణ సాధన కోసం లెక్క చేయని కెసిఆర్ ఎక్కడ, అదృష్టవశాత్తు ముఖ్యమంత్రి అయిన రేవంత్ రెడ్డి ఎక్కడ, నక్కకు నాగలోకానికి ఉన్న తేడా ఇద్దరి మధ్య ఉంటుందని అన్నారు. దళితుడిని ముఖ్యమంత్రి చేస్తామని మోసం చేశారని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు, అది ఉద్యమ సమయంలో అన్నట్లు, ఎన్నికల సమయంలో అలా అనలేదని మీ రేవంత్ రెడ్డి చాలా సందర్భాలలో చెప్పారని గుర్తు చేశారు. ౖతు రుణమాఫీ ఏదైనా గ్రామంలో సంపూర్ణంగా జరిగిందా? మహిళలకు 2500 ఏమనాయి, నిరుద్యోగ భృతి ఎక్కడ ఇలా చెప్పుకుంటూ పోతే శాంతాడంత హామీల చిట్టా ఉంటుందని ప్రశ్నించారు. ముందు మీరు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని లేనిపక్షంలో ప్రతిపక్షంగా బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడు ప్రజల తరపున కొట్లాడుతుందని పేర్కొన్నారు.

# పహల్గాం మృతులకు కొవ్వొత్తులతో ర్యాలీ




కరీంనగర్, జనతా న్యూస్: కరీంనగర్ జిల్లా ఆర్యవైశ్య అఫిషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అయిత ఈశ్వర్ ప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక తెలంగాణ చౌక్ లో జమ్ము కాశ్మీర్ లోని పహల్గాం మృతులకు సంతాపం తెలుపుతూ కొవ్వొత్తులతో నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఉగ్రవాదులపై కేంద్రం కఠిన చర్యలు తీసుకోవాలని, మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. భారత్ మాత కి జై, వందే మాతరం అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జిల్లా ఉపాధ్యక్షుడు సామ నారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు కొండూరి శ్రీనివాస్,కొత్త ప్రకాశ్, రవీందర్, ఎల్ చంద్ర శేఖర్, టౌన్ అవోపా అధ్యక్షుడు నలుమచు సుదర్శనం, మాజీ అధ్యక్షులు కట్కూరి సుధాకర్, మారుతి, అంజయ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

# రజతోత్సవ సభ సక్సెస్‌తో.. హుస్నాబాద్ నియోజకవర్గంలో గులాబీ జోష్

## సభ ఏర్పాట్లకు కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్

## ఎల్కతుర్తిలో కదం తొక్కిన రాష్ట్ర గులాబీ సైన్యాలు







(కోరెం సుధాకర్ రెడ్డి జనతా న్యూస్ ప్రతినిధి హుజురాబాద్) : హుస్నాబాద్ నియోజకవర్గంలోని హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన భారత రాష్ట్ర సమితి పార్టీ 25 వ వార్షికోత్సవం సందర్బంగా నిర్వహించిన రజతోత్సవ సభ విజయవంతమైంది. రాష్ట్రం నలుమూలల నుండి లక్షలాది మంది ప్రజలు, గులాబీ సైనికులు ఎల్కతుర్తిలో కదం తొక్కారు. దిక్కులు పిక్కటిల్లేలా జై తెలంగాణ, జై కేసీఆర్ అంటూ నినాదాలు చేసారు. కళాకారులు ఆటపాటలతో హోరెత్తించారు. విచిత్ర వేషధారణలతో ఆకట్టుకున్నారు. రజతోత్సవ సభ హుస్నాబాద్ నియోజకవర్గ గులాబీ శ్రేణుల్లో జోష్ నింపింది. సభకు హుస్నాబాద్ నియోజకవర్గం నుండి సుమారు 50 వేల మంది తరలివచ్చారు. ప్రతి గ్రామం నుండి, వాడ నుండి సభకు ప్రజలు తరలివచ్చారు. హుస్నాబాద్ మున్సిపాలిటీ లోని 20 వార్డుల నుండి జనం సభకు స్వచ్చందంగా హాజరయ్యారు. సుమారు పది లక్షల మంది రాష్ట్రం నలుమూలల నుండి ఎల్కతుర్తికి రావడం, ఎల్కతుర్తి మొత్తం గులాబీ మయం కావడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. హుస్నాబాద్ నియోజకవర్గంలో వేలాది మంది రైతులు సభకు హాజరయ్యారు. ఈ సభ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతకు అద్దం పట్టిందని పలువురు చెప్తున్నారు.

**కెసిఆర్ కు హుస్నాబాద్ సెంటిమెంట్**

గులాబీ దళపతి కేసీఆర్ కు హుస్నాబాద్ అంటే సెంటిమెంట్. అందుకే ఆయన 2014 2018 ఎన్నికల ప్రచారాన్ని హుస్నాబాద్ నియోజకవర్గం నుండే ప్రారంభించారు. ప్రస్తుతం రజతోత్సవ సభ జరిగిన ఎల్కతుర్తి లోని సభా స్థలం కూడా హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోనే ఉంది. ఇటు ఓరుగల్లుకు అటు కరీంనగర్ కు, ఇటు సిద్దిపేటకు అనుకూలంగా ఉంటుందనే ఉద్దేశంతోనే ఇక్కడ సభను ఫిక్స్ చేసినట్టుగా సమాచారం.

**ప్రసంగం వ్యూహాత్మకమే**

గులాబీ దళపతి కేసీఆర్ ప్రసంగం వ్యూహాత్మకంగానే నిర్ణయించినట్టు తెలుస్తోంది. నిజానికి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర మాత్రమే అయింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉపయోగిస్తున్న భాష పై విమర్శలు వస్తున్న నేపథ్యంలో తాను ఆ పద్ధతిలోనే మాట్లాడవద్దని కెసిఆర్ నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. అందుకే ఆయన ఎక్కడ ప్రసంగంలో అభ్యంతరకర పదాలు వాడలేదు. ఒకటి రెండు తెలంగాణ సామెతలను ఉదహరించారు. గతంలో ఉద్యమ సమయంలో కేసీఆర్ పార్టీలను పాతాళంలో పాతిపెట్టాలని, బంగాళాఖాతంలో పడేయాలని, గ్రామాలకు వస్తే తన్నితరమాలని, సన్నాసులు ఎదవలు, గాడిదలు, దున్నపోతులు, రాష్ట్రాన్ని కుక్కలు చింపిన విస్తరి చేశారనే వంటి పదాలు తరచుగా ఉపయోగించేవారు. కానీ ఈసారి ఆయన కూల్గానే మాట్లాడారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర మాత్రమే అయినందున ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే జనం నుండి చప్పట్లు వస్తాయి కానీ.. కొందరి నుండి విమర్శలు కూడా వస్తాయనే ఉద్దేశంతో ప్రసంగాన్ని నియంత్రణలో పెట్టినట్టు తెలుస్తోంది.

**సభ ఉద్దేశం నెరవేరిందా?**

కొంతమంది రాజకీయ విమర్శకులు.. ఇప్పుడు సభను నిర్వహించడంలో ఆంతర్యం ఏమిటి అనే కోణంలో విమర్శలు చేశారు. కానీ పెద్ద ఎత్తున రజతోత్సవ సభ నిర్వహించడం వెనుక గులాబీ పార్టీకి రాజకీయ ప్రయోజనాలు కూడా ఉన్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో సందిగ్ధ పరిస్థితి ఉంది. కాంగ్రెస్ పార్టీపై ప్రజా వ్యతిరేకత కనిపిస్తున్నట్టుగా ప్రచారం జరుగుతోంది. ఇదే సమయంలో బిజెపి కూడా నాయకత్వలేమితో సతమతం అవుతుంది. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు కూడా రానున్నాయి. ఈ నేపథ్యంలో పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు భరోసా ఇవ్వాల్సిన బాధ్యత కూడా అధిష్టానం మీద ఉంటుంది. ఈ సభ ద్వారా గులాబీ పార్టీ బలంగా ఉందనే సందేశాన్ని కార్యకర్తలకు ఇచ్చారు. తద్వారా కార్యకర్తలు ఇతర పార్టీలోకి వెళ్లకుండా కట్టడి చేసినట్టు అవుతుంది. అలాగే ప్రజల్లోనూ.. పార్టీ బలంగా ఉందనే సంకేతాలు వెళ్తాయనే ఉద్దేశంతోనే సభను నిర్వహించినట్లు తెలుస్తోంది.

**భూముల కోసం రైతులతో మాట్లాడిన సతీష్ కుమార్**

ఎల్కతుర్తి లో సభ నిర్వహించాలని గులాబీ దళపతి కేసీఆర్ నిర్ణయించిన వెంటనే హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే, కెసిఆర్ అంతరంగికుడు మాజీ ఎంపీ కెప్టెన్ వి లక్ష్మీకాంతరావు తనయుడైన సతీష్ కుమార్ అప్రమత్తమయ్యారు. చింతలపల్లి గ్రామానికి చెందిన రైతులతో మాట్లాడారు. వందలాది మంది రైతులతో మాట్లాడి, ఎలాంటి అడ్డంకులు లేకుండా, సుమారు 25 వేల ఎకరాల్లో సభ నిర్వహించుకునేందుకు నిరభ్యంతర పత్రాలను తీసుకున్నారు. స్థానికంగా ఇలాంటి ఇబ్బందులు అభ్యంతరాలు ఎదురుకాకుండా చూశారు. రైతుల భూములకు భరోసా ఇచ్చారు.

**సభ ప్రకంపనలు**

బి ఆర్ ఎస్ రజతోత్సవ సభ ప్రకంపనలు సృష్టించింది. సోమవారం కూడా ఏ ఇద్దరు కలిసిన సభ గురించే చర్చించుకున్నారు. సభకు జనం పోటెత్తారని, ఇంత పెద్ద సభ తామెప్పుడూ చూడలేదని చర్చించుకోవడం కనిపించింది. హనుమకొండ కరీంనగర్ సిద్దిపేట మార్గాలు సభ ముగిసిన తర్వాత పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ జరిగింది. ట్రాఫిక్ క్లియర్ చేయడానికి రెండు మూడు గంటల సమయం పట్టింది. దీంతో రోడ్లపై వాహనాలన్నీ పెద్ద ఎత్తున నిలిచిపోయాయి. ఎల్లాపూర్ వరకు హుజురాబాద్ వరకు కార్యకర్తలు నడుస్తూ వెళ్లారంటే ఎంత స్ఫూర్తితో వచ్చారో అర్థం చేసుకోవచ్చు. ఒకవైపు సభ ముగిసినప్పటికీ సుదూర ప్రాంతాల నుండి ఆలస్యంగా చేరుకున్న వారు.. సభా ప్రాంగణంలోకి వెళ్లి ప్రాంగణాన్ని చూసి వెనుదిరిగారు. సభ ముగిసి కెసిఆర్ వెళ్లిపోయిన ఇంకా సభకు వస్తూనే ఉన్నారు. బిఆర్ఎస్ అధికారం కోల్పోయిన తర్వాత ఏడాదిన్నర కాలంలోనే ఇంత పెద్ద సభ నిర్వహించడం, లక్షలాదిమంది సభకు హాజరు కావడం రాజకీయ విశ్లేషకులను సైతం ఆశ్చర్యానికి గురిచేసింది. సభకు వచ్చిన వారిలో ఎక్కువ అంటే 80% 20 నుంచి 50 ఏళ్ల లోపు వారే. ఇది ప్రభుత్వ వ్యతిరేకతను స్పష్టంగా చూపించిందని పలువురు పేర్కొన్నారు. ఏది ఏమైనా హుస్నాబాద్ నియోజకవర్గంలో రజతోత్సవ సభ రాజకీయ ప్రభావాన్ని చూపించింది, దీని ప్రభావం భవిష్యత్తులోనూ కనిపిస్తుందని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

# కరీంనగర్ బస్టాండ్‌లో పోలీస్ అవుట్‌పోస్ట్ ప్రారంభం, నేరాల నియంత్రణకు చర్యలు



కరీంనగర్, జనతా న్యూస్: వేసవి సెలవుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, కరీంనగర్ బస్టాండ్‌లో చోటుచేసుకునే దొంగతనాలు మరియు ఇతర నేరాలను అరికట్టేందుకు కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు సోమవారం ఒక పోలీస్ అవుట్‌పోస్ట్‌ను ప్రారంభించింది. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఈ అవుట్‌పోస్ట్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, బస్టాండ్‌లో ప్రయాణికులకు ఎదురయ్యే ఇబ్బందులను తొలగించడానికి, ముఖ్యంగా దొంగతనాల నియంత్రణకు ఈ అవుట్‌పోస్ట్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఇప్పటికే బస్టాండ్ ఆవరణలో ఉన్న 45 సీసీ కెమెరాలను కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశామని ఆయన తెలిపారు. భవిష్యత్తులో అవసరమైన ప్రాంతాల్లో మరో 15 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను కోరినట్లు వెల్లడించారు. ఈ పోలీస్ అవుట్‌పోస్ట్‌లో 24 గంటల పాటు పోలీసు అధికారులు మరియు సిబ్బంది అందుబాటులో ఉంటారని కమిషనర్ తెలిపారు. బస్టాండ్‌లో ప్రయాణికులకు ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే ఈ అవుట్‌పోస్ట్‌ను సంప్రదించవచ్చని ఆయన సూచించారు. అంతేకాకుండా, జేబు దొంగల చిత్రాలను ప్రజలకు కనిపించేలా ప్రత్యేక బోర్డులపై ప్రదర్శిస్తామని ఆయన పేర్కొన్నారు. ఇటీవల కరీంనగర్ బస్టాండ్‌లో ప్రయాణికుల బ్యాగులు దొంగతనం చేస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారని కమిషనర్ గుర్తు చేశారు. అతని వద్ద నుంచి 150 గ్రాముల బంగారం మరియు 10 లక్షల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రయాణికులు తమ లగేజీ పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఏసీపీ వెంకటస్వామి, కరీంనగర్ వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్, ఎస్సై రాజన్న, ఆర్టీసీ అధికారులు ఎస్ భూపతి రెడ్డి (డిప్యూటీ రీజనల్ మేనేజర్, ఆపరేషన్స్, కరీంనగర్ రీజియన్), డిపో మేనేజర్లు విజయ మాధురి, శ్రీనివాస్, బస్టాండ్ ఏటీఎం జి సురేష్, కార్గో మేనేజర్ రామారావు మరియు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# "పద్మ" భూషణులారా..... మీకు వందనం....

## పద్మ అవార్డు గ్రహీతులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ అభినందనలు...

హైదరాబాద్, జనతా న్యూస్: రాష్ట్రపతి ద్రౌపది ముర్మూ చేతుల మీదుగా పద్మ అవార్డులు అందుకున్న తెలుగు ప్రముఖులందరికీ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈరోజు రాత్రి న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ లో జరిగిన పద్మ అవార్డుల కార్యక్రమానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మ విభూషణ్ అవార్డు అందుకున్న దువ్వూరు నాగేశ్వర్ రెడ్డి, పద్మ భూషణ్ అందుకున్న బాలక్రిష్ణ, పద్మశ్రీ అవార్డు అందుకున్న మాడుగుల నాగఫణి శర్మలను బండి సంజయ్ ఆలింగనం చేసుకున్నారు. మీకు పద్మ అవార్డు దక్కడం తెలుగు ప్రజలకు దక్కిన గౌరవం అని పేర్కొన్నారు.

# కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో పాత వస్తువుల వేలం విజయవంతం



కరీంనగర్, జనతా న్యూస్: కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లోని వివిధ విభాగాలకు చెందిన ఉపయోగించబడిన మరియు పాత వస్తువుల వేలం సోమవారం ఉదయం 10:00 గంటలకు కరీంనగర్ సిటీ ట్రైనింగ్ సెంటర్‌లో విజయవంతంగా నిర్వహించబడింది. ఈ వేలం ద్వారా మొత్తం ₹ 4,41,100 ఆదాయం సమకూరిందని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. వేలంలో వివిధ రకాలకు చెందిన మొత్తం 7 లాట్లను ఉంచగా, వాటికి మంచి స్పందన లభించింది. పాత ఫర్నిచర్ మరియు ఇతర పనికిరాని వస్తువులను కొనుగోలు చేయడానికి పలువురు ఆసక్తి చూపారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, వేలం ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని, వచ్చిన ఆదాయాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం జమ చేస్తామని వెల్లడించారు. ఈ వేలం విజయవంతం కావడానికి సహకరించిన సిబ్బందిని ఆయన అభినందించారు.

